## 7.2.3 దిగంబర కవిత్వం

నూతన వ్యవస్థ ఏర్పడాలనే తలంపే ఉద్యమాలకు ఊపిరి. మార్పు అనేది సహజం. అది ఉద్యమ రూపాన్ని ధరించవచ్చు. ఉద్యమ రూపం ధరించకుండానే తొలగిపోవచ్చు. ఉద్యమాల ఆదర్శం మంచికో చెడుకో దారితీసినట్టుగా కనిపించినా అవి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించి నిలిచిపోతాయి. 1965లో ప్రారంభమై 1968 వరకు దిగంబరకవులు జీవిత వాస్తవికత లేని దుస్థితి ఏర్పడినందుకు పెనుభూతం లాంటి జడత్వాన్ని పోగొట్టటానికి సమాజం మీద విరుచుకుపడ్డారు. ఉన్నదాన్నంతా ధ్వంసం చేయాలనే సంకల్పం కొంత, అస్తిత్వవాద ఛాయలు, అరాచకవాదం దిగంబర కవిత్వంగా అవతరించి సమాజంలోని స్తబ్దతను తీసివేయటమే ప్రయోజనంగా భావించింది.

ఫ్రాన్సులో క్యూబిజం, డాడాయిజమ్, ఇటలీలో ఫ్యూచరిజమ్, జర్మనీలో ఎక్స్ ప్రెషనిజమ్, అమెరికాలో ఇమేజిజమ్ బయలుదేరాయి. విలువలను విధ్వంసం చేసే ఉద్యమాలుగా డాడాయిజమ్ సర్రియలిజమ్ కవితారంగంలో బయలుదేరాయి. ఏ ఇజపు ప్రభావం మాపై లేదని దిగంబర కవులు చెప్పినా విధ్వంసక దృష్టి వీరి కవిత్వంలో కనిపిస్తుంది. 'రాజకీయ నినాదాల కోసం ఉద్దేశించినది అంతకంటే కాదు. ఈ దేశంలో, ఈ గోళంలో ఊపిరి పీల్చే ప్రతి మనిషి ఉనికి కోసం తపన పడి, అతని భావిని చూసి వెక్కి వెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత' అని దిగంబర కవులు తమ ఆశయాన్ని వ్యక్తం చేసారు.

నిఖిలేశ్వర్ (యాదవరెడ్డి), నగ్నముని (ఎం.హెచ్. కేశవరావు), చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), జ్వాలాముఖి (వీర రాఘవాచార్యులు), మహాస్వప్న (కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు), భైరవయ్య (మన్‌మోహన్ సహాయ్)లు దిగంబర కవులుగా 1965లో దిగంబర కవితోద్యమం ప్రకటించారు. 'రాజకీయ

నినాదాల కోసం ఉద్దేశించింది అంతకంటే కాదు. ఈ దేశంలో, ఈ గోళంలో ఊపిరి పీల్చే ప్రతిమనిషి ఉనికికోసం తపనపడి, అతని భావిని చూసి వెక్కివెక్కి ఏడ్చి, పిచ్చెత్తి ప్రవచించిన కవిత' అని మొదటి సంపుటిలో వివరించారు.

అసలైన అస్తిత్వం ఆధునిక మానవుడిలో ఆవిష్కరింపబడాలని, మానవత్వాన్ని ప్రతిష్ఠించే మానవుడైన మహర్షి కోసం అన్వేషణ సాగిస్తున్నారని వ్యక్తి వ్యక్తిగా పరిణతి పొందాలని, వ్యక్తిగత స్వేచ్ఛ ప్రధానమని, అతడిలో జీర్ణించుకు పోయిన జడత్వాన్ని వదిలించాలని, చైతన్యవంతమైన అత్మసంతృప్తిని సాధించాలని దిగంబరకవులు ఆశించారు.

'డబ్బు పొరల్ని చీల్చి కాస్మిక్ మార్గాన్ని నిర్దేశించేవి యీ దిక్‌లు. మానవత్వపు విలువలు వీటి సరిహద్దులు'[1] అని దిక్కులనే కవితాఖండికలలో తమ లక్ష్యాన్ని వివరించారు.

మానవత్వపు విలువలు పెరగాలంటూ మానవుడే సమాజ నిర్మాణానికి మూల పురుషుడని మార్పు అతనిలోనే రావాలని కోరుకున్నారు దిగంబర కవులు.

"మంచి మనసు పరిమళాలు
విశ్వవ్యాప్తి కాకపోవు
భావితరం గుర్తించకపోదు" [2]

'మానవుడు అందరిలోనూ నిలబడి తనలో తాను జీవించడం నిజమైన అస్తిత్వం'. ఆ అస్తిత్వం మానవునిలో రావాలన్నది దిగంబర కవుల లక్ష్యం.

1. దిగంబర కవులు, సంపుటి 2, దిక్‌లు-సూచిక మూడు కవితా సంకలనాల ఏకైక సంపుటి, యం. శేషాచలం అండ్ కంపెనీ, మద్రాసు, 1971, పుట 70.
2. దిగంబర కవులు, చెరబండరాజు, సంపుటి 2, యం. శేషాచలం అండ్ కో కంపెనీ, 1971, పుట 122.



మానవత్వాన్ని ప్రతిష్ఠించే మానవుడైన మహర్షి కోసం ప్రయత్నం సంప్రదాయ కవిత్వాన్ని నిరసించి అభ్యుదయ కవులపై ధ్వజమెత్తారు. కవిత్వంలో సూటిగా నగ్నంగా చెప్పబడే సత్యాల్ని స్వచ్ఛమైన భావాల్ని ప్రకటించారు. దుర్గంధ సంస్కృతిని నాశనం చేసే నిజమైన మనుషులు కావాలని అంటారు.

'నీ ఆశయం సూర్యుణ్ణి మాత్రం పిడికిట్లోంచి జారవిడవకు' అనేది దిగంబర కవుల నినాదం, సత్యాన్వేషణ దిగంబర కవిత్వ లక్ష్యం. "మానవులంతా ఒక కొత్త కుటుంబంగా ఏర్పడటం గురించి కలగని అది నిజం కావాలన్న ఆశతో, ఆవేశంతో, కవితా కరదీపికలతో నిజాయితీ గల అన్వేషణగా సాగిన దిగంబర కవితా ఉద్యమం తెలుగు సాహిత్యంలో ఒక చారిత్రక ఘట్టం"[1] దిగంబర కవులకు భూత, వర్తమాన కాలాలపై రోత. సత్యదర్శనం సర్వమానవ కళ్యాణం కావాలని కాంక్షించారు.

1. కేతవరపు రామకోటి శాస్త్రి, ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు, అక్టోబర్ 2001, పుట 240.